సాక్షి
ములుగు

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా సిద్ధం

చిన్న కాళేశ్వరం లిఫ్టు ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ట్రాన్స్‌కో సీఈ రాజుచౌహాన్ తెలిపారు. - 8లో▸



ప్రయాణికుల భద్రతే ముఖ్యం

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0^0 /22.0^0

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఓరుగల్లులో రణనినాదం



భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం ఆనాడు ప్రజలు చేసిన ఉద్యమమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. దొరలు, దేశ్‌ముఖ్‌లను గడగడలాడించి దున్నేవాడిదే భూమి అనే నినాదంతో నిజాం పాలనకు చరమగీతం పాడారు. రజాకార్ల అరాచకాలను ఎండగట్టారు. పంటను పాలకులు లాక్కుంటే మహిళలు వేటకొడవళ్లతో తరిమికొట్టారు. ఈ నేల నుంచి చాకలి ఐలమ్మ పోరాటం, దొడ్డి కొమురయ్య తోపాటు అనేక మంది అమరులయ్యారు. ఉమ్మడి జిల్లాలో జరిగిన ఉద్యమాలు, వీరోచిత పోరాటంపై (సెప్టెంబర్ 17 సందర్భంగా) 'సాక్షి' ప్రత్యేక కథనాలు. - 8లో▸

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరుబాట పట్టిన వరంగల్

- సాయుధ పోరాటంలో ఉమ్మడి జిల్లా పాత్ర కీలకం
- అసువులుబాసిన అమరులెందరో..

నేడు (సెప్టెంబర్ 17 సందర్భంగా) ఉద్యమ జ్ఞాపకం



పరకాలలో వెలిసిన అమరధామం

మరో జలియన్ వాలాబాగ్ పరకాల

పరకాల: పరకాల పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సాయుధ పోరాటంలో భాగంగా అజ్ఞాతంలోకి వెళ్లిన నేతల పిలుపు మేరకు 1947 సెప్టెంబర్ 2న అనేక గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు పరకాలకు తరలివచ్చారు. అప్పటికే ఇక్కడ నిజాం పోలీసులు మకాం వేశారు. విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 15మంది అమరులయ్యారు. రజాకారులు వెంటాడి 180 మందికిపైగా ఉద్యమకారులను తీవ్రంగా గాయపర్చారు. మొగుళ్లపల్లి మండలం రంగాపురంలో ముగ్గురిని చెట్టుకు కట్టేసి కాల్చిచంపారు. చంద్రగిరి గుట్టలను కేంద్రంగా చేసుకుని సాయుధ పోరాటం జరిపారు. మరో జలియన్‌వాలాబాగ్ ఘటనను కళ్లకు కట్టినట్లు అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు తన తల్లి చంద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వందలాది విగ్రహాలనుతయారు చేయించారు. పరకాల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రెండేళ్లు శ్రమించి 2003 సెప్టెంబర్ 17న ఆ విగ్రహాలతో ఏర్పాటు చేసిన అమరధామాన్ని ఆయన ప్రారంభించారు.

పోలీసు ఉద్యోగం వదిలి..

మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన రేగూరి చంద్రారెడ్డి నాడు నిజాం నిరంకుశ పాలనపై పోరాటం చేశారు. పోలీసు ఉద్యోగం మానేసి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పరకాల కేంద్రంగా సాయుధ పోరాటం చేసిన యోధుల్లో చివరగా మిగిలిన.. ఆయన ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు.





బాబు దొరను మట్టుబెట్టిన రైల్వేస్టేషన్ వ్యాగన్ పాయింట్

చరిత్రకు సాక్ష్యం జనగామ రైల్వేస్టేషన్

జనగామ: దొరల ఆగడాలకు చరమగీతం పాడింది జనగామ రైల్వేస్టేషన్. విస్నూరు దొర లష్కర్ (సికింద్రాబాద్)కు పారిపోయే ప్రయత్నంలో సాయుధ పోరాట యోధులు మట్టుబెట్టి తమ వీరత్వాన్ని చాటుకున్నారు. విస్నూరు దొర రాపాక రాంచంద్రారెడ్డి కొడుకు బాబు దొర అరాచకాలు మితిమీరిపోయాయి. 1947లో సవారు కచ్చురంలో నలుగురు విప్లవకారుల కాళ్లు, చేతులను కట్టేసి తన గూండాలతో గడ్డివాములో తలదాచుకుని తెల్లవారు జామున 4 గంటల వరకు లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చేరుకున్నాడు. ఊరి శివారున ఉన్న ఈత చెట్ల సమీపంలో ముగ్గురిని చంపేశాడు. ఇందులో ఓ ఉద్యమకారుడు చాకచక్యంగా తప్పించుకుని, కుందారం గ్రామానికి చేరుకుని జరిగిన ఘటనను స్థానికులకు వివరించాడు. దీంతో పదివేల మందికిపైగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దొర పోలీస్ స్టేషన్‌లో తలదాచుకుని రైల్వేస్టేషన్ సమీపంలోని పాత ఎస్‌బీహెచ్ ఆవరణలో ఉన్న తన చిన్నమ్మ ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. విప్లవ యోధుడు గబ్బెట తిరుమల్‌రెడ్డి నాయకత్వంలో జాటోత్ దరాగ్యనాయక్, మరికొందరు విప్లవకారులు నాటి రైల్వే వ్యాగన్ ఏరియాలో దొర రాకకోసం ఎదురు చూశారు. పట్టాలపై ఆగిఉన్న గూడ్స్ రైలు కింది నుంచి దాటుకుంటూ వ్యాగన్ పాయింట్ మర్రిచెట్టు కిందకు రాగానే దరాగ్యనాయక్.. దొర మెడపై మొదటి వేటు వేయడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. విప్లవకారులు దొరను చిత్రహింసలు పెట్టి చంపేశారు. అనంతరం ప్రజలు సంబురాలు చేసుకున్నారు. దొరకు చరమగీతం పలికిన రైల్వే స్టేషన్ నాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

న్యూస్‌రీల్

కొత్తల పండుగకు సెలవు ఇవ్వాలని వినతి



ఏటూరునాగారం: నేడు పెద్దల(కొత్తల) పండుగ సందర్భంగా ఐటీడీఏలో పనిచేస్తున్న ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని కోరుతూ మంగళవారం ఐటీడీఏ అధికారులకు ఆదివాసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రకృతి అనుబంధంగా జరుపుకునే పండుగ కొత్తల పండుగ అన్నారు. ఉత్తర కార్తె ప్రారంభం మొదటి పాదంలో బుధ, గురు వారాల్లో ఈ పండుగను ఆదివాసీలు జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెరమయ్య(పూజారి) డప్పు వాయిద్యాల నడుమ ఇంటింటికీ తిరిగి అంబి జమ చేసి ఊరి బయట దోరణ స్తంభాలు గ్రామానికి నలుదిక్కుల ఏర్పాటు చేసి అంబలి ఆరబోసి పూజలు చేస్తారని వివరించారు. ఈ పండుగ సందర్భంగా ఐటీడీఏ ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని కోరారు.

'వార్డెన్లు, హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి'



ములుగురూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులతో పనిచేయిస్తున్న వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. చదువుకుంటున్న విద్యార్థులతో ఐదు రోజులుగా వంట చేరుస్తున్నారని తెలిపారు. విద్యార్థులు సమయానికి క్లాసులు వినకపోవడంతో చదువుకు దూరం అవుతారని వివరించారు. విద్యార్థులతో పనిచేయిస్తున్న వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులపై తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక వైద్యశిబిరం



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించగా ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ ప్రారంభించారు. భద్రాచలం ఐటీడీఏ అదనపు డీఎంహెచ్‌ఓ సైదులు, వాజేడు ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో 561 మంది రోగులు పరీక్షలు చేయించుకోగా వారందరికీ మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 82 మంది చిన్న పిల్లలు, స్త్రీ సంబంధ సమస్యలతో బాధపడుతున్న 30 మంది మహిళలు, కంటి సమస్యలతో బాధపడుతున్న 50 మందిని, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న 390 మందిని వైద్య శిబిరానికి వచ్చిన వైద్య నిపుణులు పరీక్షించారు. ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ వైద్య శిబిరంలో మనోజ్, రిదిమ, రవితేజ, మహేందర్, మధుకర్, గ్నానస, సిబ్బంది కోటిరెడ్డి, వెంకటనర్సమ్మ, రఘు, రాహుల్ ఇతర సిబ్బంది ఉన్నారు.

సొసైటీ పాలకవర్గాలపై వేటు

పదవీకాలం పొడిగింపులో ప్రభుత్వం కొత్త మెలిక

- సొసైటీల పనితీరు బాగుంటేనే పొడిగించాలని ఉత్తర్వులు
- జిల్లాలో 12 సొసైటీల్లో 3 పాలకవర్గాలు రద్దు
- పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించిన అధికారులు



లక్ష్మీదేవిపేట పీఏసీఎస్ కార్యాలయం (ఫైల్)

వెంకటాపురం(ఎం): సింగిల్ విండో సొసైటీల పాలకవర్గాలపై సహకార శాఖ చర్యలకు పాల్పడుతుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణాలు తీసుకొని సభ్యులు చెల్లించకపోవడంతో పాలకవర్గాన్ని బాధ్యులను చేస్తూ తొలగిస్తున్నారు. జిల్లాలో 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా ఇప్పటికే మూడు సొసైటీల పాలకవర్గాలను రద్దు చేసి పర్సన్ ఇన్‌చార్జ్‌లను సహకార అధికారులు నియమించారు. జిల్లాలోని వెంకటాపురం(ఎం) మండలంలోని లక్ష్మీదేవిపేట, పాలంపేట పీఏసీఎస్ పాలకవర్గాలతో పాటు ఏటూరునాగారం పీఏసీఎస్ పాలకవర్గం రుణాలను రికవరీ చేయడంలో నిర్లక్ష్యం చేశారని బాధ్యులను చేస్తూ పాలకవర్గాలను రద్దు చేశారు. దీంతో జిల్లాలోని మూడు పీఏసీఎస్‌లకు చెందిన ముగ్గురు చైర్మన్లు, ముగ్గురు వైస్ చైర్మన్లు, 33 మంది డైరెక్టర్లు పదవులు కోల్పోవడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

రెండోసారి పొడిగింపులో ప్రభుత్వం మెలిక

ములుగు జిల్లాలో 12 పీఏసీఎస్‌లు ఉన్నాయి. పీఏసీఎస్‌లకు 15 ఫిబ్రవరి 2020లో ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 16న చైర్మన్లను, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16తో ఐదేళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరునెలల పాటు పదవీకాలాన్ని పొడగించింది. పొడగించిన పదవీకాలం ఆగస్టు 15వ తేదీతో ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి మరో ఆరునెలల పాటు పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల్లో పాలకవర్గాల పనితీరు బాగున్న సంఘాలను మాత్రమే పొడగించాలని, సొసైటీల అభివృద్ధికి పాటుపడని పాలకవర్గాలను రద్దు చేయాలని పేర్కొంది. ప్రధానంగా సొసైటీ పరిధిలో సభ్యులు తీసుకున్న రుణాల రికవరీపై దృష్టి సారించని పాలకవర్గాలపై చర్యలు చేపట్టాలని జిల్లా సహకార అధికారులను ఆదేశించింది. దీంతో సొసైటీల పనితీరు బాగాలేదని మూడు పాలకవర్గాలను రద్దు చేసి లక్ష్మీదేవిపేటకు ఎం.దేవేందర్‌రావు, పాలంపేటకు చంద్రశేఖర్‌రావు, ఏటూరునాగారానికి రాజేష్‌లను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా అధికార యంత్రాంగం నియమించింది.

పాలకవర్గాల నిర్లక్ష్యంతోనే నష్టాల్లో సొసైటీలు

పీఏసీఎస్‌లలో సభ్యులు తీసుకున్న రుణాలను రికవరీ చేయకపోవడంతో పాలకవర్గాలు నిర్లక్ష్యం చేయడంతోనే సొసైటీలు నష్టాల్లో ఉన్నాయి. దీంతో జిల్లాలోని ఏటూరునాగారం, లక్ష్మీదేవిపేట, పాలంపేట పాలకవర్గాలను రద్దు చేసి పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించాం. 12 సొసైటీల పనితీరును పరిశీలిస్తున్నాం. వీటిలో మరో రెండు సొసైటీల రికార్డులు పూర్తిగా తనిఖీ చేస్తున్నాం. సొసైటీల నిర్వహణ సరిగా లేని పాలకవర్గాల పదవీకాలాన్ని పొడగించవద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి.

\- సర్దార్‌సింగ్, జిల్లా సహకార అధికారి

పోషణ్ అభియాన్ విజయవంతం చేయాలి

కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్: పోషణ్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ దివాకర అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సీడీపీవోలు, పోషణ్ అభియాన్ సిబ్బంది, మెడికల్ హెల్త్, పంచాయతీ రాజ్, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ పోషణ్ అభియాన్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల కోఆర్డినేషన్‌తో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో పోషణ్ అవగాహన ర్యాలీలు, వాణిజ్య ప్రదర్శనలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ ర్యాలీలు, వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు ఫోలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోషకాహారానికి సంబంధించి సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సమస్యలను నివారించి ఆరోగ్య మహిళలుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ నారి స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 కోట్లతో పట్టణాభివృద్ధి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ములుగు: ములుగు పట్టణాభివృద్ధికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులను విడుదల చేసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసినట్లు వెల్లడించారు. అనంతరం రవిచందర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి మంత్రి సీతక్క నిత్యం కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో ములుగు పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. రూ.150 కోట్లతో మేడారం పనులు, ములుగు ఆధునిక బస్టాండ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చింత నిప్పుల భిక్షపతి, వంగ రవియాదవ్‌తో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మొదటి నిమిషమే డైమండ్ అవర్

- బాధితులు 1930 కాల్ చేస్తే అకౌంట్ ఫ్రీజ్ చేస్తాం
- సైబర్ క్రైం డీఎస్పీ నందిరాంనాయక్



మాట్లాడుతున్న నందిరాం నాయక్

ములుగు: మోసపోయిన మొదటి నిమిషమే డైమండ్ అవర్ అని బాధితులు హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేస్తే వెంటనే సంబంధిత సొమ్మును రికవరీ చేసేందుకు, నేరస్తుల అకౌంట్‌ను హోల్డ్‌లో పెడుతామని ములుగు సైబర్ క్రైమ్ డీఎస్పీ నందిరాం నాయక్ తెలిపారు. సైబర్ క్రైం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సైబర్ వలలో చిక్కుకుని మోసపోయిన బాధితులు వెంటనే హెల్ప్‌లైన్ నంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. మొదటి గంటలోపు గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే సొమ్మును రికవరీ చేసేందుకు 100శాతం అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగుల, వ్యాపారస్తుల డేటాను సేకరించి వారికి అనుసంధానంగా ఉన్న ఏపీకే ఫైళ్లను పంపుతున్నారని తెలిపారు. దీంతో ఫైల్స్ ఓపెన్ చేసి నష్టపోతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతిరోజూ సుమారు 5 నుంచి 10 కోట్ల రూపాయలను సైబర్ నేరస్థుల చేతిలో బాధితులు పోగొట్టుకుంటున్నారని వివరించారు. అనవసరమైన ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేసి నష్టం జరిగితే బాధితులు 1930 కాల్ చేస్తే తెలంగాణ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కి వెళ్తుందన్నారు. వెంటనే సిబ్బంది స్పందించి పోలీసుల అంతర్గత సైట్ ద్వారా డబ్బులు వెళ్లిన అకౌంట్‌ను ఫ్రీజ్ చేస్తారని వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయేది ఎక్కువ మంది విద్యావంతులేనని తెలిపారు. ప్రజలు అనవసరమైన లింకుల జోలికి వెళ్లవద్దని డీఎస్పీ వివరించారు.

వేతనం ఇవ్వకపోవడంతోనే మహేశ్ ఆత్మహత్య

- బాధితుడి కుటుంబానికి కేటీఆర్ రూ.5.50 లక్షల సాయం
- పోస్టల్ బాండ్‌ను అందించిన బీఆర్‌ఎస్ నేతలు



మహేశ్ కుటుంబానికి పోస్టల్ బాండ్‌ను అందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ములుగు: మున్సిపల్ కార్మికుడు మైదం మహేశ్‌కు సకాలంలో వేతనం ఇవ్వకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని మృతికి బాధ్యత వహిస్తూ రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుడు మహేశ్ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.5.50లక్షల ఆర్థిక సాయాన్ని అందించగా బీఆర్‌ఎస్ నేతలు బాధితుడి పిల్లల పేర్లపై పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. అనంతరం మాధవరావుపల్లిలో గల మహేశ్ కుటుంబ సభ్యులకు పోస్టల్ బాండ్‌ను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి, లక్ష్మణ్‌బాబు విలేకర్లతో మాట్లాడారు. మహేశ్ ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. ఐదు నెలల నుంచి వేతనం అందకపోవడం, మున్సిపాలిటీలో అధికారులను అడిగినా జీతం ఇవ్వకపోవడంతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు మహేశ్ ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవిందనాయక్, మాజీ జెడ్పీటీసీలు సకినాల భవాని, బేతెల్లి గోపాల్‌రెడ్డి, రుద్రమదేవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సానికొమ్ము రమేష్ రెడ్డి, లింగాల రమణారెడ్డి, నాయకులు పోరిక విజయ్‌రాంనాయక్, లకావత్ నరసింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి



యశ్వంత్‌కు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న డీఈఓ సిద్ధార్థరెడ్డి

గోవిందరావుపేట: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్వాయి మోడల్ స్కూల్‌లో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌ను మంగళవారం జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, సైన్స్‌పై మక్కువతో విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావం పెరుగుతుందన్నారు. క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్ ఛాలెంజెస్ అనే అంశంపై నిర్వహించిన సైన్స్ సెమినార్ విజేతలను డీఈఓ ప్రకటించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సెమినార్‌లో ఏటూరునాగారం మండల పరిధిలోని రామన్నగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.యశ్వంత్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. రేపు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొంటాడని వివరించారు. అనంతరం చల్వాయిలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి అధ్యక్షతన టీఎల్‌ఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. సృజనాత్మక బోధనకు టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఎంతో ముఖ్యమని డీఈఓ సిద్ధార్థరెడ్డి అన్నారు. విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగిస్తూ విద్యార్థులకు బోధన చేయాలన్నారు. అత్యుత్తమమైన 8 మంది ఉపాధ్యాయులు మెటీరియల్‌తో బోధిస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో సీహెచ్.మహేందర్, యశస్విని, టి.సంధ్యారాణి, పూర్ణిమ, రాజశేఖర్, టి.రాజేశ్ కుమార్, ఏ.వెంకటేశ్, మహేందర్ ఉన్నారు.

ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, ఏటూరునాగారం మండల విద్యాశాఖ అధికారి కొయ్యడ మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, కళాశాల ప్రిన్సిపాల్ గండు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాలో మాట్లాడుతున్న డీఈఓ

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

వెంకటాపురం(ఎం): విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు డీఈఓ సిద్ధార్థరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుతీరు, మధ్యాహ్న భోజన వివరాలు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, టీచర్ డైరీ, బేస్ లైన్, ఫార్మాటివ్ అసెస్‌మెంట్ ఫలితాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ సాంబయ్య, హెచ్‌ఎం రాధిక, ఉపాధ్యాయులు బాబురావు, సంధ్యారాణి, కిశోర్ బాబు, అంబేద్కర్, మహేష్‌లు పాల్గొన్నారు.

ప్రజాపాలన వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ములుగు: ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ దివాకర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జరగనున్న వేడుకలకు మంత్రి సీతక్క హాజరు కానున్నట్లు తెలిపారు. నేటి ఉదయం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జీపీల్లో ప్రత్యేక అధికా రులు జాతీయ పతాకాన్నిఆవిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు ఉదయం 9.55 గంటలకు మంత్రి సీతక్క చేరుకుంటారని పేర్కొన్నారు. 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చే స్తారు. ఉదయం 10.05 గంటలకు గౌరవ వందనం స్వీకరించి 10.10 గంటలకు సీతక్క ప్రసంగిస్తారని వెల్లడించారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయం విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది.



విద్యుత్‌కాంతులతో వెలిగిపోతున్న కలెక్టరేట్



కలెక్టరేట్ ప్రధాన ద్వారానికి సీరీస్ లైటింగ్

పాము కాటుతో మహిళ మృతి


కమల మృతదేహం

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో నివాసముంటున్న లావుడియా కమల(35) పాము కాటుకు గురై మంగళవారం మృతి చెందింది. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం దేశరాజుపల్లికి చెందిన కమల–రమేశ్ దంపతులు బతుకుదెరువు కోసం వచ్చి కొత్తపల్లి శివారులో ఉంటున్నారు. ఈక్రమంలో మంగళవారం ఇంట్లో నిద్రిస్తుండగా కమలను పాము కాటేసింది. భర్త రమేష్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా కమల మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కమలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..


సాంబరాజు(ఫైల్)

ఐనవోలు: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని రాంనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్ర సాంబరాజు(41) గీత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వృత్తిలో భాగంగా మంగళవారం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సాంబరాజుకు భార్య సంధ్య, కుమారుడు సిద్ధు, కూతురు సిరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

కేసముద్రం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని చంద్రుతండా జీపీ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటగిరి సమీపంలోని చంద్రుతండా జీపీకి చెందిన చెందిన లకావత్ దేవా(35) వెంకటగిరి గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించేక్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కనున్న భగీరథ ఎయిర్ వాల్ దిమ్మెను ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

ఓరుగల్లులో రణనినాదం

సాయుధ పోరాటంలో ఉమ్మడి జిల్లా కీలక భూమిక

1947 ఆగస్టు15న భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చినా.. హైదరాబాద్ స్టేట్ నిజాం పాలనలో మగ్గుతూనే ఉంది. నిజాం నిరంకుశత్వంతో విసుగెత్తిన జనాలు తిరగబడ్డారు. రజాకార్లను తరిమికొట్టారు. స్వేచ్ఛావాయువుకోసం పోరాడుతున్న నాటి హైదరాబాద్ స్టేట్ ప్రజలు.. దేశ తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో చేపట్టిన పోలీస్ చర్యతో 1948 సెప్టెంబర్ 17న భారత్‌లో భాగస్వామ్యమయ్యారు.

- నిజాం దొరలు, రజాకార్లను తరిమికొట్టిన వీరులు
- ప్రాణ త్యాగాలతో స్వేచ్ఛావాయువులు
- సెప్టెంబర్ 17 సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు


గ్రామంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం

సాయుధ పోరులో డోర్నకల్

డోర్నకల్: మానుకోట జిల్లా డోర్నకల్ మండలం పెరుమాళ్ల సంకీస, ఉయ్యాలవాడ, వెన్నారం, బూరుగుపాడు, తోడేళ్లగూడెం, చిలుకోడు తదితర గ్రామాల నుంచి అనేకమంది పోరులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన తుమ్మ శేషయ్య, ఏలూరి వీరయ్య, నున్న పుల్లయ్య దళకమాండర్లు ఉండడంతో రజాకార్లు ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. దళాల ఆచూకీ తెలపాలని 1948 సెప్టెంబర్ 1న 200 మంది రజాకార్ల ముఠా పెరుమాళ్ల సంకీసపై దాడి చేసింది. బందెల దొడ్డి వద్ద కాల్పులు జరపడంతో 16 మంది అక్కడికక్కడే.. గాయపడ్డ ఆరుగురు తర్వాత చనిపోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల అనంతరం మృతదేహాలతోపాటు గాయాలైనవారిని తగులబెట్టారు. ఉయ్యాలవాడలో 1947 ఫిబ్రవరి 14న రజాకార్లు జరిపిన దాడిలో ఇద్దరు గ్రామస్తులు చనిపోయారు.

రజాకార్లు ఉన్మాదుల్లా ప్రవర్తించారు..



ఆరోజు రజాకార్లు ఉన్మాదుల్లా ప్రవర్తించారు. రజాకార్లంతా నాటుసారా తాగి గ్రామస్తులను ఒక్కచోట చేర్చి తుపాకులతో విచక్షణారహితంగా కాల్చి చంపారు. చనిపోయిన వారిని, గాయపడ్డవారిని గడ్డిలో వేసి నూనె పోసి కాల్చారు. నన్ను తీవ్రంగా కొట్టడంతో పారిపోయాను. నా కుటుంబంతో సహా కాంపెల్లి సమీపంలో అడవుల్లో ఆరు నెలలు దాక్కున్నాం.

– తేరాల గురవయ్య, పెరుమాళ్లసంకీస, డోర్నకల్ మండలం

భయంతో వణికిపోయాం..



ఆ రోజు మా ఇంటి పక్కనే ఉన్న బందెల దొడ్డి వద్ద తుపాకుల కాల్పులు వినిపించడంతో భయంతో వణికిపోయాం. మానాన్న తుపాకీ గాయాలతో ఇంటికి వచ్చి కొంతసేపటికి చనిపోయాడు. తర్వాత అందరం ఇంటి నుంచి పారిపోయి మూడు నెలలపాటు అడవుల్లో దాక్కున్నాం.

– గుడిమెట్ల రామక్క, పెరుమాళ్ల సంకీస, డోర్నకల్ మండలం

పోరాడినందుకు గర్వపడుతున్నా..


మాట్లాడుతున్న తోడేటి కొమురయ్య

గార్ల: గీత కార్మికుడైన తోడేటి రామస్వామి, శాంతమ్మకు 1928లో జన్మించిన నేను భారత కమ్యూనిస్టు పార్టీలో పనిచేశా. 'నిజాం తొత్తు జాగీర్దార్ సైతం గార్లలో అజమాయిషీ చెలాయిస్తూ దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడేవాడు. రజాకార్లకు హెడ్‌గా మిస్కిల్‌సాబ్ వ్యవహరించేవాడు. జీవంజిపల్లిలో రజాకార్లకు రైఫిల్ ట్రెనింగ్ ఇచ్చేవాడు. రజాకార్లు పగలు గ్రామాల్లో ప్రదర్శన నిర్వహిస్తూ 'జిన్నీకా హుకుం సే నెహ్రూకు జుకాదేంగే' అంటూ నినాదాలు చేసేవారు. నాడు అందరూ ఉర్దూ మీడియం చదవాల్సిందే అంటూ హుకుం జారీచేశారు. జాగీర్దార్ వ్యవస్థలో తహసీల్దార్లుగా ఉన్న నూరుద్దీన్, రషీద్‌మియా అమానుష ఆగడాలకు అంతులేకుండా పోయింది. అప్పట్లో 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'.. అంటూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట శంఖాన్ని పూరించిన దాశరథి కృష్ణమాచారి, రంగాచారి స్ఫూర్తితో 18 సంవత్సరాల వయసులో నేను నాటి సామాజిక పరిస్థితులకు ప్రభావితుడనయ్యాను. రజాకార్లు, నైజాం పోలీసులు రాంపురంలో బాలింతను చెరచడంతోపాటు దుబ్బగూడెం, ముల్కనూరు గ్రామాల్లో విచక్షణారహితంగా దాడులు చేశారు. ప్రజలు చెట్టుకొకరు. పుట్టకొకరుగా ఇళ్లు వదిలి పెట్టాల్సిన పరిస్థితులు నన్ను కలిచివేసి ఉద్యమం వైపు నడిపించాయి. నాడు ఈ ప్రాంత ఉద్యమ కమాండర్‌గా పనిచేస్తున్న తుమ్మల శేషయ్య నాయకత్వంలో ముందుకు సాగాం. బండ్లకుంట వద్ద సేదతీర్చుకుంటున్న మా దళానికి రజాకార్లకు మధ్య 1948లో జరిగిన ఎదురు కాల్పుల్లో దామినేని వెంకటేశ్వరరావు, బుచ్చిమల్లు, మరికొంతమంది అమరులయ్యారు.

పోరాటాల కేంద్రం.. బయ్యారం


బయ్యారంలోని అమరవీరుల స్మారక స్తూపం

బయ్యారం: నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలకు బయ్యారం కేంద్రంగా బిందువుగా చెప్పవచ్చు. నిజాం పాలనను వ్యతిరేకించిన దామినేని వెంకటేశ్వరరావు, కంచర బుచ్చిమల్లుతోపాటు 30 మందిని మండలంలోని బండ్లకుంట సమీపంలో నిజాం పోలీసులు కాల్చి చంపారు. అనంతరం వారి మృతదేహాలను ఎడ్లబండ్లపై గ్రామాల్లో ఊరేగించి అందరినీ ఒకే చితిపై పెట్టి కుటుంబ సభ్యులు సైతం కడసారి చూపునకు నోచుకోకుండా దహనం చేశారు. పోరాటాల పురిటిగడ్డగా పేరు తెచ్చుకున్న బయ్యారంలో 1969లో మొదటిసారిగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక స్తూపం నిర్మించారు. బయ్యారం గాంధీసెంటర్‌లో ఉన్న అమరవీరుల స్మారక స్తూపం నాటి పోరాట పటిమ, త్యాగాలకు సాక్షిగా నిలుస్తోంది.

ఊరూరా ఉద్యమకారులు



నారాయణరెడ్డి 1943లో స్నేహితులతో కలిసి దిగిన ఫొటో (ఫొటోలో ఎడమవైపు ఉన్న వ్యక్తి) , గానుగుపహాడ్ గ్రామం

జనగామ: జనగామ మండలంలోని వడ్లకొండ, గానుగుపహాడ్, మరిగడి, ఎర్రగొల్లపహాడ్, సిద్ధెకి ఇలా అనేక గ్రామాలు రజాకార్ల అరాచకాలను ఎదురించాయి. వడ్లకొండకు చెందిన దండెబోయిన నరహరి, మేదరి గాల్‌రెడ్డి, దేవుసాని వెంకటయ్య, సిద్ధిరాల యాదగిరి, గజ్జెల సాయిలు, కొత్త పాపిరెడ్డి రజాకార్లతో పోరాడారు. గానుగుపహాడ్‌లో నారాయణరెడ్డి, పులిగిళ్ల కొమురయ్య, కారింగుల నారాయణరెడ్డి, వనమాల నాగమల్లయ్య.. ఇలా ఎందరో వీరులు ఉద్యమంలో నేలకొరిగారు. దండెబోయిన నరహరిపై నిజాం నవాబు 18 మర్డర్ కేసులను నమోదు చేసి రెండు ఉరిశిక్షలు విధించారు. ఓ సమయంలో రజాకార్లకు పట్టుబడిన నరహరిని సజీవంగా చితిపై పడుకోబెట్టి కాల్చేందుకు ప్రయత్నిస్తుండగా చాకచక్యంగా తప్పించుకున్నాడు. నరహరిని ప్రాణాలతో పట్టుకోవాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశాడు. 12 ఏళ్లపాటు జైలు జీవితం గడిపిన ఆయన 20 ఏళ్ల క్రితం మృతి చెందారు. గానుగుపహాడ్‌కు చెందిన నారాయణరెడ్డి ఉపాధ్యాయ వృత్తి వీడి రజాకార్లను తుదముట్టించేందుకు దళంలో చేరాడు. ప్రస్తుత సిద్దిపేట జిల్లా కూటిగల్ గ్రామంలో రజాకార్లు నారాయణరెడ్డిని అతి కిరాతకంగా చంపేశారు.

నిజాం పాలనలో తెలుగు మీడియం పాఠశాల


ఏబీవీ ఎయిడెడ్ పాఠశాల

జనగామ: నిజాం పాలనలోనే జనగామలో తెలుగు మీడియం పాఠశాలను ఏర్పాటు చేశారు. 1943లో పాఠశాలకు అంకుర్పారణ చేసి.. 1945లో విద్యాబోధన ప్రారంభించారు. మైస్టన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఉపద్రష్ట వెంకటరామశాస్త్రి తన ఉద్యోగానికి రాజీనామా చేసి జనగామ తాలూకాలో మొదటి తెలుగు పాఠశాలకు శ్రీకారం చుట్టారు. తెలుగుకు ఓ గుర్తింపు తీసుకొచ్చేందుకు తాపత్రయపడ్డారు. ఆంధ్ర భాషాభివర్ధిని ఉన్నత పాఠశాల(ఏబీవీ)గా నామకరణం చేశారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 1949లో నాటి ప్రభుత్వం ఏబీవీ స్కూల్‌ను ఎయిడెడ్‌గా మార్చింది.

సాయుధ పోరాటం@జనగామ


1949లో సైనిక ప్రభుత్వం ఆధీనంలో తిరుమల్‌రెడ్డి (ఫైల్)

జనగామ: తెలంగాణ సాయుధ పోరాటం జనగామలోనే పురుడు పోసుకుంది. విస్నూరు రాంచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ఆరుట్ల రామచంద్రారెడ్డి నాయకత్వంలో నల్లా నర్సింహులు, చకిలం ధర్మారెడ్డి, యాదగిరిరావు నేతృత్వంలో 1946 జూలై 14న కడవెండి పోరుకు అంకురార్పణ చేశారు. గబ్బెట తిరుమల్‌రెడ్డి, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, చాకలి అయిలమ్మ, ఏసిరెడ్డి నర్సింహారెడ్డి, గానుగుపహాడ్ నారాయణరెడ్డి, దండబోయిన నర్సింహులు, బిట్ల ముత్తయ్య ప్రాణత్యాగం చేశారు. జనగామ మొట్టమొదటి ఎమ్మెల్యే గంసాని గోపాల్‌రెడ్డి రాజకీయ నాయకుడిగా సాయుధ పోరాటానికి తన సేవలందించారు. నిజాం నవాబ్ 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఎదుట లొంగిపోయారు. సైనిక ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి ఎన్‌కౌంటర్ రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో జరిగింది. తెలంగాణ సాయుధ పోరాట దళం సెంట్రల్ కమాండ్‌గా పనిచేసిన గంగసాని తిరుమల్‌రెడ్డిని సైనిక బలగాలు పట్టుకుని చెట్టుకు కట్టేసి కంచనపల్లిలో మొదటి ఎన్‌కౌంటర్ చేశాయి. దొరల స్వాధీనంలో ఉన్న 1.40 కోట్ల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసేందుకు సాయుధ పోరాటం దోహదపడింది.

అమాయకులను బలిగొన్న రజాకార్లు


కొంకపాక గ్రామపంచాయతీ

పర్వతగిరి: ఖాసీంరజ్వీ ఆధ్వర్యంలో రజాకార్లు 1948 మార్చి 11 చౌటపల్లి గ్రామాన్ని చుట్టుముట్టారు. 21 మందిని నిర్బంధించి తుపాకులతో కాల్చి చంపారు. కొంతమంది ఇళ్లను తగులబెట్టారు. అదేవిధంగా కొంకపాక గ్రామం దొరల పాలనలో సాగింది. మాజీ మంత్రి తక్కళ్లపల్లి పురుషోత్తమరావు తండ్రి తక్కళ్లపల్లి వెంకట్రాం నర్సయ్య ఆధీనంలో గ్రామం ఉండేది. దీంతో రజాకార్లు దొరలను టార్గెట్ చేశారు. వారి సంపదను దోచుకున్నారు. అడ్డువచ్చిన వారిని కాల్చి చంపారు. కొందరి ఇళ్లను దహనం చేశారు. ఈ ఘటనలో 15 మంది బలైపోయారు.

వెంటాడి చంపారు..



రజాకార్లు క్రూరత్వంతో గ్రామంలోకి చొరబడ్డారు. 21 మంది అమాయకులను బలిగొన్నారు. వేటాడి వెంటాడి తుపాకులతో కాల్చి చంపారు. ఇళ్లను తగులబెట్టి భయభ్రాంతులకు గురైనట్లు మా తండ్రి తెలిపారు.

– డాక్టర్ వంగల శాంతికృష్ణ, గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, చౌటపల్లి

లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా సిద్ధం

- ట్రాన్స్‌కో సీఈ రాజుచౌహాన్


నూతన సబ్‌స్టేషన్ టెస్ట్ చార్జ్ చేస్తున్న సీఈ, అధికారులు

కాటారం: చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా గారెపల్లి పంప్‌హౌస్ కోసం నిర్మించిన సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ట్రాన్స్‌కో సీఈ రాజుచౌహాన్ తెలిపారు. ఎస్‌ఈ మల్సూర్‌తో కలిసి సీఈ లిఫ్ట్ ఇరిగేషన్ గారెపల్లి నూతన సబ్‌స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో అమర్చిన యంత్రాల వివరాలు, పవర్ లోడ్ కెపాసిటీ, సరఫరా ప్రక్రియ తదితర అంశాలపై ట్రాన్స్‌కో అధికారులతో ఎస్‌ఈ చర్చించారు. ప్రొటెక్షన్ వింగ్, టెక్నికల్ వింగ్ ఆధ్వర్యంలో టెస్ట్ చార్జ్ చేశారు. అనంతరం లో ఓల్టేజ్ సమస్య నివారణలో భాగంగా మండల కేంద్రంలోని ఎర్రగుంటపల్లిలో అమర్చిన నూతన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సీఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నట్లు సీఈ తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు సీఎండీ ఆదేశాల మేరకు అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఈఈలు పాపిరెడ్డి, సదానందం, ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

- దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి


మూడో లైన్‌ను పరిశీలిస్తున్న సీఆర్‌ఎస్ మాధవి, డిప్యూటీ సీఆర్‌ఎస్ శ్రీనివాసరావు, డీఆర్‌ఎం రాజగోపాలకృష్ణన్, అధికారులు

మహబూబాబాద్ రూరల్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంపై దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని సికింద్రాబాద్ డివిజన్ సేఫ్టీ కమిషనర్ మాధవి అన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన మూడో లైన్ సేఫ్టీ అంశాలపై కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్‌ఎస్) బృందం ఉన్నత అధికారులు మంగళవారం సందర్శించింది. ప్రత్యేక రైలులో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ చేరుకున్న సీఆర్‌ఎస్ బృందం మొదటగా సిగ్నల్ ఆపరేటింగ్, స్టేషన్ మాస్టర్ గది, సేఫ్టీ గదిలో సాంకేతిక అంశాలను పరిశీలించింది. అనంతరం నూతనంగా నిర్మించిన రైల్వే లైన్ పనివిధానం, నిర్మాణశైలిని సందర్శించిన అధికారులు దక్షిణ మధ్య రైల్వే శాఖ సేఫ్టీ కమిషన్ నిబంధనల మేరకు పనులు జరిగాయా.. లేదా.. అని పరిశీలించారు. మూడో రైల్వే ట్రాక్ వద్ద పాయింట్ తిక్ వెబ్ స్విచ్ పనివిధానాన్ని పరిశీలించి, అక్కడి నుంచి నూతనంగా నిర్మించిన ఎల్.సీ 80 రైల్వే గేట్ క్యాబిన్ వద్ద శాఖాపరమైన అంశాలను తనిఖీ చేసి, అక్కడి ఆవరణలో మొక్కలు నాటారు. డీఆర్‌ఎం రాజగోపాలకృష్ణన్, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ విభాగాల ఉన్నత అధికారులు గుడేషార్, సృజన్ రెడ్డి, రణధీర్ రెడ్డి, సునీల్ కుమార్ వర్మ, శ్రీనివాసరావు, స్థానిక రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్ కుమార్, రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కనకరాజు, స్టేషన్ మాస్టర్ రమేష్ పాల్గొన్నారు.

రైల్వే థర్డ్‌లైన్ పరిశీలన

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్ మీదుగా కొత్తగా ఏర్పాటుచేసిన రైల్వే థర్డ్‌లైన్‌ను కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సీఆర్‌ఎస్) మాధవి, డీఆర్‌ఎం రాజగోపాలకృష్ణన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలోని తాళ్లపూసపల్లి, కేసముద్రం, ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మీదుగా అప్‌లైన్‌లో థర్డ్ లైన్‌పై ప్రత్యేకంగా మోటార్ ట్రాలీపై ప్రయాణిస్తూ, అడుగడుగునా పనితీరును పరిశీలించారు. రైల్వేస్టేషన్‌ను సందర్శించారు.

దేశాభివృద్ధికి వన్ నేషన్ – వన్ ఎలక్షన్

- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం


కార్యక్రమంలో పాల్గొన్న సయ్యద్ జాఫర్ ఇస్లాం, నాయకులు

కాజీపేట అర్బన్: వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ రాజ్యసభ సభ్యుడు సయ్యద్ జాఫర్ ఇస్లాం తెలిపారు. హంటర్ రోడ్డులోని సీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ నేషన్– వన్ ఎలక్షన్ కోసం తెలంగాణ విద్యార్థులు' నినాదంతో వన్ నేషన్ – వన్ ఎలక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సయ్యద్ జాఫర్ ఇస్లాం హాజరై మాట్లాడారు. 1984లోనే నాటి ప్రధాని వాజ్‌పేయి వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రతిపాదన తీసుకురాగా అదే అంశాన్ని 2019లో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక తీసుకొచ్చారని తెలిపారు. ఎన్నికల్లో కోట్ల రూపాయల ఖర్చు తగ్గించుకునేందుకు, సమయం, ప్రజాధనం వృథాకాకుండా ఈ విధానం తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు దేశాభివృద్ధికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ అంటోనీ, వన్ నేషన్ వన్ ఎలక్షన్ రాష్ట్ర కన్వీనర్ భర్తుర్ శ్రీరాం, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గౌతమి అహీర్‌రావు, మీజీ ఆర్మీ డాక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ భిక్షపతి మాచర్ల, క్లాసికల్ డ్యాన్సర్ బారాది విజయ్‌కుమార్, ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీత నక్క స్నేహలత, వివిధ జిల్లాల అధ్యక్షులు కొలను సంతోష్‌రెడ్డి, గంట రవికుమార్, వెంకటేశ్వర్లు, నిషిధర్‌రెడ్డి, రమేష్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, నాయకులు రావుపద్మరెడ్డి, కాశీప్రసాద్, రావు అమరేందర్‌రెడ్డి, కొత్త రవి, పాండేజీ, మల్లికారావు, అహన్యరాజ్, కార్తీక్ పాల్గొన్నారు.

'కుడా' ఆఫీస్ వద్ద ఉద్రిక్తత

నయీంనగర్: 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనే సామాజిక అవగాహన కార్యక్రమం కాళోజీ కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించడానికి మౌఖిక అనుమతి ఇచ్చి 'కుడా' అధికారులు రద్దు చేసినట్లు హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో శ్రేణులు మంగళవారం 'కుడా' కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆఖరి నిమిషంలో కాళోజీ కళాక్షేత్రం అనుమతిని కూడా అధికారులు రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు జరుగుతుంటే అనుమతి ఎందుకు ఇవ్వరంటూ బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. రాజకీయ పార్టీలకతీతంగా చేస్తున్న సామాజిక కార్యక్రమం అని చెప్పిన అధికారులు వినలేదన్నారు. 'కుడా' వైస్ చైర్మన్‌తో అనుమతిని ఎందుకు రద్దు చేస్తున్నారో రాతపూర్వకంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని నగరంలోని సీఎస్‌ఆర్‌కు గార్డెన్స్‌కు మార్చినట్లు వారు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ వైపే ప్రజలు

- పెరుమాండ్ల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన సునీల్

పరకాల: అసాధ్యం అనుకున్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుసాధ్యం చేసి దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రానికి, ప్రభుత్వానికి పేరు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగ ప్రజానీకమే కాకుండా యావత్తు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడం ఖాయమని అన్నారు. పరకాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత తీసుకురావడంతోపాటు దండోరా పోరాటంలో చనిపోయినవారి కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. పరకాల నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అభివృద్ధిలో కుంటుపడేస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ దండోరా కమిటీల పునర్నిర్మాణం చేసి జాతి ఐక్యతకు హక్కుల సాధనకు మాదిగలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ బాధ్యులు పెండెల రాము, పెండెల సారన్న, పూరెల్ల సూర్యం, పెండెల తిరుపతి, బరిగెల అనిల్, వడ్ల నవీన్, పెండెల ప్రసాద్, మొండి సమ్మయ్య పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.రజిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో 30 ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పూర్తి వివరాలతో వరంగల్ ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 91482 41214 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పోష్ చట్టంపై మహిళలకు అవగాహన అవసరం

- ఎంపీ కడియం కావ్య


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కావ్య

హన్మకొండ చౌరస్తా: మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్)పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో మహిళా సాధికారతపై జరుగుతున్న పార్లమెంటరీ కమిటీ పోష్ అమలు–2014 అంశంపై ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంక్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కావ్య పాల్గొని మాట్లాడారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కావ్య

సీఎం రేవంత్‌రెడ్డిని వరంగల్ ఎంపీ కడియం కావ్య హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట చేపట్టనున్న మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. భూపాలపల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయడంతోపాటు భూపాలపల్లికి దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ స్టేషన్లకు అనుసంధానించేలా రైల్వే లైన్ నిర్మాణం అంశాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకురావాలని రేవంత్‌రెడ్డిని కోరారు. 'కుడా'ను సంప్రదించకుండానే 2014 మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా చింతలపల్లి నుంచి నష్కల్, హసన్‌పర్తి రెండు కొత్త రైల్వే లైన్లు ప్రతిపాదించారని తెలిపారు. అంతేకాకుండా చారిత్రక భద్రకాళి, వేయిస్తంభాలగుడి, బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రసాద్ పథకానికి సహకరించాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా పార్లర్ల ఏర్పాటు

విజయ డెయిరీ చైర్మన్ అమిత్‌రెడ్డి


పార్లర్‌ను ప్రారంభిస్తున్న అమిత్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట: రాష్ట్రంలో అన్నిచోట్ల విజయ డెయిరీ, పార్లర్లను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పాఠశాలలకు అవసరమైన పాలు, పాల పదార్థాలు సరఫరా పెంచాలని రాష్ట్ర విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పార్లర్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలు గ్రామాల విజయ పాల డెయిరీ సొసైటీ చైర్మన్లకు పాల క్యాన్లను పంపిణీ చేశారు. విజయ పాల ఉత్పత్తుల డెయిరీ రాష్ట్రంలోనే జనగామ, బచ్చన్నపేట ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పాడితోపాటు, పంటలు పుష్కలంగా పండడానికి ఈ ప్రాంతంలో చెరువులు నింపడంలేదని రైతులు కోరడంతో చెరువులు నింపే కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, జీఎం మధుసూదన్, మల్లయ్య, గోపాల్, డైరెక్టర్లు పాల్గొన్నారు.